# నిశ్చితార్థం

కోర్టుకళ్లతో చూడకూడదు చెవులతో వినకూడదు
మనసుతో మేధస్సుతో ఆలో‌చించాలి న్యాయానికి న్యాయం చేయాలి.

---

ఆదృశ్యం నన్ను వెంటాడుతూనే వుంది.
నన్ను వదలకుండా వేధిస్తూనే వుంది.
'పాపం అతను'
అనామకంగా అతను
సకయాన పడ్తూ అతను...
ఎంత నిర్దయులు మనుషులు!
'చనిపోయుంటాడా? ఏవరైన రక్షించుంటారా?

లేక ఇంకా ఆనరకం తను భరిస్తున్నాడా?'

'చనిపోవడమే మేలు ఆబాధలు అనుభవిస్తూ చావుతప్పదని, చావుకోసం నిశ్శబ్ధంగా ఎదురుచూస్తూ చెయిత్తే పిలిచేశక్తి లేక....

'ఓహ్! కుషన్ సీట్ల మీద మెత్తగా కూర్చుని కంటెస్సా కారులో దూసుకొచ్చిన మేము మధ్యలో చూసిన ఆదయనీయమైన దృశ్యాన్ని ఎలా మర్చిరోగలం?'

నిన్న విజయవాడ నుండి రేడియో ప్రోగ్రామ్ ఇచ్చి కారులో తిరిగివస్తున్నాం మధ్యాహ్నం మూడుగంటల వేళ హాయిగా నా కనురెప్పల మీద నిద్రాదేవి పదవిన్యాసం చేస్తున్న సమయం.

ఉలిక్కిపడి కళ్ళు విశాలం చేసుకుని చూసాను. మిట్ట మధ్యాహ్నం మండుటెండలో ఒక మనిషి - రక్తపు మడుగులో గిలగిలలాడుతూ-స్పృహ వుందో లేదో తెలియని స్థితిలో... డ్రైవర్ కారును ప్రక్కకు లాగి ముందుకు దూసుకు పోతున్నాడు. ఒక్క క్షణం నిద్రపోయిన నామేధస్సు మేల్కొంది. వెనక్కి తిరిగి చూసాను. మెల్లిగా కాళ్ళు చేతులు కొట్టుకుంటున్నాడతను - రక్షించమని చేయెత్తయినా సంజ్ఞచేయడం లేదు.

"డ్రైవర్," పిలిచాను.

"అమ్మా!"కారు పోనిస్తునే కొద్దిగా తల ప్రక్కకు తిప్పాడు.

"కారాపు"

'కారుస్లోచేసాడు.

"ఏమ్మా"

"అతనికేమయింది?"

"అతనెవరో రోడ్డుమీదపాపం ఏ లారీయో వచ్చి కొట్టినట్టుందమ్మా"

'అయితే ఆపు కారులో తీసుకెళ్ళి ఒంగోలులో హాస్పిటల్‌లో చేర్పిద్దాం'

"రక్తం పారుతోందమ్మా" కారు స్లోగా పోనిస్తూ అన్నాడు.

"పర్వాలేదు. సీట్లు పాడైపోతాయి. పోనీ మనిషి ప్రాణంకంటే ఎక్కువకాదులే"

"దానిగురించి కాదమ్మా అతను ఆఖరిదశలో వున్నట్టున్నాడు. స్పృహలో లేనట్టున్నాడు."

"అందుకే కదయ్యా! నువ్వు మొదటికారు ఆరాపు. ఆలస్యమయితే ఇక్కడ అతని ప్రాణం పోవచ్చు."

"అమ్మా!" మీరన్నట్టు ఒకరికి సహాయం చేయడంలో తప్పేమీలేదమ్మా మీరన్నట్టు కారుసీట్లు పాడైనా పర్వాలేదు. కానీ కేసుపెడ్తారు, కోర్టుచుట్టూ తిరిగాల్సొస్తుంది...."

"తిరిగితే తిరిగాంలే. ఒక కిలోమీటరు వచ్చేసావు" కోపంగా అన్నాను. మా వెనుక నుండి ఒక ఎంబాసిడర్, ఒక మారుతీకారు, ఒక జీప్, ఆ మూడు వెహికల్స్ ఒకటి తర్వాత ఒకటి మమ్మల్ని దూసుకెళ్ళాయి. ఆశగా వెహికల్స్‌లోపలికి చూసాను ఆఖరిక్షణాల్లో వున్న అతన్ని వాళ్లల్లో ఒక్కడైనా హాస్పిటల్‌కి తీసుకెళ్తున్నారేమోనని కానీ అందులో అతని ఆఖరి యాత్రలేదు.

డ్రైవర్ ప్రక్కగా కారు ఆపేడు.

"చూసారామ్మా వాళ్ళల్లో ఒక్కరు కూడా ఆమనిషిని తీసుకెళ్ళడానికి ఇష్టపడలేదు - చాలా గొడవలున్నాయమ్మా దాంట్లో మీరు తీసుకెళ్ళమంటే తీసుకెళ్తాను వెనక్కి"

కారు ఆపాక జోలపాట ఆగినట్లయిందేమో? నిద్రపోతున్న మాతాత లేచి నిటారుగా కుర్చున్నారు.

"ఏవిటోయ్! కారాపావేం? ఏమైంది?"

"ఏమీ లేదు సార్ అంటూనే వున్న విషయం టూకీగా తాతయ్యకు చెప్పేసాడతను.

"భలేవాళ్ళే పోనీండి పోనీండి దారిన పోయే శని తలకు చుట్టుకోవడమేమిటి?"

"నువ్వు కూడా ఏమిటి తాతయ్యా! ఆప్టాల్ ఒకటో రెండో సార్లు కోర్టుకెళ్తాం అలాఅని చనిపోతున్న మనిషిని చూస్తూ వూరుకొంటామా ప్లీజ్ తాతయ్యా"

తాతయ్య నాతల మీద చెయ్యివేసాడు.

"చూడు తల్లీ! నీ వయస్సులో నేనూ నీలా ఆవేశపడ్డవాడనే కానీ నాతలమీద వెంట్రుకలు తెల్ల బడక ముందే నేను ఇలాటి కేస్‌లో ఇరుక్కున్నాను... ఒకసారి. ఆ తర్వాత జ్ఞానోదయం అయిందనుకో అదీ చెప్తానుండు"

డ్రైవర్ వైపు తిరిగాడు. "నువ్వు కారుపోనీవోయ్"

"తాతయ్యా ప్లీజ్ అతన్ని అలా వదిలి వెళ్ళడం అమానుషత్వం మొదట అతన్ని రక్షించు. ఆతర్వాత నీకథ వింటాను."

"ఆ తర్వాత విని లాభం ఏమిటి? నువ్వు కారు స్టార్ట్ చేయవోయ్"

డ్రైవర్ ఇగ్నీషన్ కీ తిప్పాడు ఫస్ట్ గేర్‌వేసి,

"దీనదయాళ్! వుండు స్టార్ట్ చేయకు"

డ్రైవర్ వెనక్కి తిరిగి చూసాడు తాతయ్య వైపు

"నువ్వు పోనీవోయ్ పిల్ల కాకికేం తెలుసు వుండేలు దెబ్బ"

"నేను నొచ్చుకున్నాను" తాతయ్య వైపు కోపంగా చూసి అటు తిరిగి కూర్చున్నాను. కారు కదలకుండా గుర్‌గుర్ మంటోంది.

"చిట్టి తల్లీ నామాట విను అట్లా అలిగితే ఎలాగమ్మా "నేను మాట్లాడలేదు.

"నాకు అనుభవం లేదు తల పండిపోయిన వాణ్ణి నేను చెప్పింది విను తల్లీ" నాగడ్డం పట్టుకుని తన ప్రక్కకు తిప్పుకున్నాడాయన.

నాకు కోపంగా వుంది బాధగా వుంది విరక్తిగా వుంది.

'పాపం అతను కొనఊపిరిలో వున్నానని తెలిసీ బ్రతికించమని కనీసం చెయ్యెత్తి పిలిచి ప్రాధేయపడలేని నిర్వీర్య స్థితిలో ఎంత దుర్భర దశలో వున్నాడతను! ఎలాటి హెల్ప్ అందక చనిపోతున్నాననే భయం, తన ప్రక్కన తన వాళ్ళంటూ ఎవరూ లేరనే బాధ అతన్ని ఎలా తినేస్తున్నాయో!' నాగుండెలో తడి ఈసారి

తాతయ్య కటువుగా అన్నాడునాతో "మొండి కేయకు చిన్నా! తెలిసినవాణ్ణి చెప్తున్నాను నువ్వు వినాలి". కారు పోనీడ్రైవర్"

డ్రైవర్ తాతయ్య చెప్పిందే తడువు కారు స్టార్ట్ చేసేసాడు. నామనసు ఊరుకోవడం లేదు. తాతయ్య తన అనుభవాన్ని కథగా చెప్తున్నాడు

అప్పుడు నాకు 30 సంవత్సరాలు ఉడుకురక్తం ఉరకలువేసే వయస్సు పనిమీద ఊరెళ్తున్నాను తొలి వెలుతురిరేఖలు ప్రపంచాన్ని తాకిన ప్రభాతకాంతులో ఇలాగే రోడ్డు ప్రక్కన తూముమీద వేలాడుతూ ఓ పాతిక సంవత్సరాలమ్మాయి కన్పించింది. ఆమెకు చీర చిందర వందరై దయానీయంగా నోటి చివర నెత్తురు కారుతోంది. నేను మోటార్‌బైక్ మీద వెళ్తూ చూసాను అప్పుడు టైమ్ ప్రొద్దున ఆరు. ఇంకో అరగంట ముందయితే నేను ఆమెను గమనించకపోదును. నాకన్ని తిప్పలు వచ్చేవీకావు. నా ఆస్థి కోర్టు ఖర్చులకు హరించుకపోయేదీకాదు.

నేను అర్థం కానట్టు చూసాను.

"అవునమ్మా! అప్పుడు ఇంత స్తితి మంతులం కాదు మనం. ఏదో లేని వాళ్ళు మనివించుకోకుండా, వున్నవాళ్ళలిస్ట్‌లో లేకుండా ఇప్పుడు కదా మీనాన్న డాక్టరయి సంపాయించింది."

"చెప్పండి"తొందర చేసాను మరో రెండు మూడు కిలో మీటర్లు ముందుకెళ్ళినా తాత చెప్పే కథవిని దాన్ని కొట్టిపారేసి అతన్ని కార్లో ఎక్కుంచుకుని రావాలనినామనసు ఆరాట పడ్తూనే వుంది. తాతయ్య మరలా మొదలెట్టాడు.

నేను బైక్‌దిగి ఆమె దగ్గరగా వెళ్ళాను. దాహమన్నట్టు చూసింది. నా దగ్గర నీళ్ళు లేవు చుట్టూ ప్రక్కలా లేవు. అదే చెప్పి అన్నాను ఆమెతో.

'మిమ్మల్ని హాస్పిటల్‌కి తీసుకెళ్తాను. వెనుక నన్ను పట్టుకుని కుర్చోగలరా?'

కూర్చుటానని తలాడించింది, కానీనిల్చోలేకపోయింది. ఎత్తుకుని తెచ్చి స్కూటర్ మీద కూర్చోబెట్టాను. నామీద వాలిపోయి కూర్చుంది. ఆమె చేతులతో నా పొట్ట చుట్టేయించి బైక్ స్టార్ట్ చేశాను. అప్పుడప్పుడు ఒక చెయ్యి వెనక్కి పెట్టి ఆమె పడిపోతుందేమోనని చూసుకుంటూ వెళ్తున్నాను. కొద్ది దూరం వెళ్ళాక ఆమె చేతులు నీళ్ళొదుల్తున్నట్లు అనుమానం కలిగి బైక్ ఆపిచూస్తే, ఆమె స్పృహ తప్పిపోతోంది. ఏమి చెయాలో తోచలేదు. అది చాలా రిమోట్ ఏరియా ఒక్క వాహనం కూడా ఆరోడ్డు మీదుగా రావడం లేదు ఆమెను ముందుకు జరిపి నేను వెనక కూర్చుని ఆ ప్రక్కనే పడున్న చిరిగిపోయిన చాంతాడుతో ఆమె గుండెలకి నా పొట్టకువేసి కట్టేసాను.

అయన చెప్తూ ఆగాడు. ఆగి వెనకవీపుకు ఆనించిన దిండు సర్థుకుని వేసుకున్నాడు నేను తాతయ్య వైపు విసుగ్గా చూసాను.

"త్రోవలో అష్టకష్టాలు పడి, ఆఖరుకు ఒక ప్రైవేట్ హాస్పిటల్‌కి తీసుకెళ్ళాను 'వాళ్ళ వాళ్ళను పిలిపిస్తే డబ్బుకట్టుకుంటారులే' అని ఆ హాస్పిటల్ డాక్టర్‌కేసు తీసుకోనుఒప్పుకో లేదు. తర్వాత గవర్నమెంట్ హాస్పిటల్ ఎక్కడా అని అడిగి వెళ్ళి ఎమర్జెన్సీ రూమ్‌లో ఓ బెడ్ మీద పడుకోబెట్టాను. ఆమెను అలాచేతిలమీద తీసుకొచ్చినందుకు బిత్తరపోయారు నర్సులు.

"వెంటనే ట్రీట్‌మెంట్ ఇచ్చారా? తాతయ్యా' అడిగాను నేను ఆత్రుతగా

నవ్వాడు తాతయ్య "లేదమ్మా మొదట వాళ్ళుచేసిన పని పోలీస్‌లకు ఫోన్‌చేయడం.

"పోలీసులొచ్చేదాకా ఆమెకేమీ ట్రీట్‌మెంట్ ఇవ్వలేదా?"

"లేదు. ఆపేషంటు అడ్రస్ మాత్రం తీసుకున్నారు"

"గొప్పపనిచేసారు నువ్వు కష్టపడి అంత హైరాన పడి తీసుకెళ్ళిందెందుకంట?"

"వాళ్ళ బాధలు వాళ్ళవి, సెలైన్ అదీ తయారు చేసుకుంటున్నారు లే ఈ లోపల ఇన్స్పెక్టర్ రానేవచ్చారు. మరణవాఙ్మూలం తీసుకున్నాడు"

"ఏం చెప్పిందామె"? ఆతృతగా అడిగాను.

"నిట్టూర్చాడు తాతయ్య"

"ఏమీ చెప్పలేదు నావైపు చూపించి, కన్ను మూసింది"

నేను నిశ్శబ్దంగా తాతవైపు చూసాను ఆయన గతాన్ని తలచుకుని, చేదు జ్ఞాపకాలు గుర్తొచ్చాయోమో! మరొక్కసారి నిట్టూర్చాడు.

'ఆ అమ్మాయి స్పృహలో వుండి జరిగిన సత్యం చెప్పినా, లేక పోలీసులు రాక చనిపోయినా నాకీ తిప్పలుండేది కాదు" ఆయన నిట్టూర్చారు.

"ఏమైంది"ఆసక్తిగా అడిగాను. నాకు కొంత అర్థమయింది. కొంత అర్థం కాలేదు.

"పాపం ఆ పిల్ల నావైపు చూపించి, నాసహాయానికి మొదట కృతజ్ఞతలు చెప్పి తర్వాత జరిగింది చెప్పాలనుకుందో ఏమో నావైపు వేలు చూపించింది. కానీ అది నామెడకు ఉరితాడవుతుందని ఆ పిల్ల ఆ అపస్మారక దశలో అనుకొని వుండదు పాపం"

"తర్వాత?" నేను కూడా నిటారుగా కూర్చుంటూ అడిగాను.

"తర్వాతేముందమ్మా? ఈ పోలీసులు ఇదిగో తోక అంటే అదిగో తల అంటారు. ఆమె నావైపు వేలు చూపిన దాన్ని ఆధారంగా తీసుకుని నేనెంత చెప్తున్నా వినకుండా నామీద కేసు నమోదు చేసారు"

"నీ మీదా?"

"ఆ నా మీదే అందుకే నిన్ను ఆ ప్రయత్నం నుండి ఆపుతున్నాను"

ఈసారి డ్రైవర్ కల్పించుకున్నాడు "అమ్మగారు అంటారు కానీ సార్ ఆమనిషిని తీరా మనం హాస్పిటల్లో చేర్చాక అపస్మారక స్థితిలో మనమే యాక్సిడెంట్ చేసామని చెప్పినా చెప్తాడు. అలా మా వాళ్ళ కొకరికి జరిగింది సార్"

"అవునోయ్!"

"నువ్వు చెప్పు తాతయ్యా"

"ఇంకేముందమ్మా చెప్పడానికి?... నెలల కాలాలు కోర్టుల చుట్టూ తిరిగాక బంధు జనంలో ముద్దాయిననే ముద్ర వేయించుకున్నాక నిర్దోషినని తెలిస్తే ఏం తెలియక పోతే ఏం? ఆచేదు జ్ఞాపకాల తాలూకు నీడ తాతయ్య ముఖం మీద కదుల్తోంది

"నిర్దోషి అని ఎలాగూ తెలుస్తుంది ఈ రోజు కాకపోతే రేపు దానికనీ కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందని, ఒక ప్రాణం పోతుంటే చూస్తూ వూర్కోవడం నాకేం నచ్చలేదు"

"నువ్వు పొరపడుతున్నావు తల్లీ అదృష్టవశాత్తూ నాకేసు ఫైనలైజ్ కాకముందే ఆమెను చంపినవాడు తాగిన మైకంలో తనే చంపినట్టు తూలాడు కాబట్టి నేను బయట పడ్డాను. లేకపోతే మరో పదిరోజుల్లో కటకటాల వెనక్కు వెళ్ళుండేవాడినే అసలు నీకీ తాతయ్య మిగిలే వాడోకాదో!"

"అతనెందుకు చంపాడంట?"

"నీకెందుకులే అవన్నీ పసిపిల్లవు"

"చెప్పు తాతయ్యా"!

"చెప్తాను. దేవదానం! ఎసి ఆన్‌చెయ్యి ఉక్కగా వుంది"

కారు క్షణాల్లో చల్లబడింది కానీ నామనస్సు చల్లబడలేదు. "చెప్పు తాతయ్యా!" ఆలోచిస్తున్న తాతయ్యను కుదిపి అడిగాను. "ఏమీ లేదులేమ్మా! భర్తకు తెలియని చాటుమాటు వ్యవహారాలు తెలిసిన ఆమెభర్తే ఆమెను చంపేసాడు"

"తాతయ్యా! ప్లీజ్ కారు వెనక్కు పోనివ్వండి అని ప్రాధేయపడినా తాతయ్య కరగలేదు.

---

"ఎంతసేపటి నుండి జ్యోత్స్నా భోజనానికి పిలుస్తుంటే రావు" అమ్మ కోపంగా అంది నాఆలోచనల్లో అమ్మ పిలుపు నాకు విన్పడలేదు.

భోంచేసాననిపించి లేచాను మరలా మా రూమ్‌లో ఫామ్ బెడ్ మీద సుఖంగా పడుకున్న నన్ను ఆ దృశ్యం వదలడమేలేదు.

పాపం ఎవరైనా రక్షించారో లేదో! ఒక వేళ చనిపోయుంటే ఏపని మీదో వెళ్లిన అచను, తిరిగి వస్తాడని ఆ ఇంట్లో వ్యక్తులు ఎంత నిశ్చింతగా వున్నారో? ఈ కఠిన సత్యం తెలిసిన తర్వాత తన భర్త కొన ఊపిరితో గిలగిల లాడుతుంటే, తనిక్కడ హాయిగా సినిమా చూస్తుందనో, సరదాగా వుందనో ఆభార్య ఎంత విలపిస్తోందో....

"ఏంటి జ్యోత్స్నా ఏమిటాతినడం? నేను చూడనేలేదు ఈ ఆపిల్ అన్నా తిను" అమ్మ నారూములోకి ఆపిల్ తెచ్చిచ్చింది.

ఆపిల్‌ముక్క నోట్లో పెట్టుకున్నాను. అది చేదుగా వుంది.

ఒకవేళ నాకే అలాటి దశ పస్తే ఇలా ఆపిల్‌కాదు కనీసం మంచినీళ్ళివ్వడానికయినా, ఆప్రదేశంలో ఎవ్వరూ లేకపోతే ఆ ఊహకు ఆపిల్ మరింత చేదుగా అన్పించి ప్రక్కనప డేసాను.

తాతయ్య ఎంత నిర్దయుడు! నాన్నకు చెప్తే డాక్టరయిన నాన్నకూడా ఆమాటే అన్నాడు. ఆఖరిదశలో అయినా సరే పేషంటు వస్తే బ్రతికించొచ్చనే నాన్న కూడా తాతయ్యను మెచ్చుకున్నాడు. మంచి పని చేసావని రేప్రొద్దున తన భర్తా అంతేనా?'

నా గుండెల్లో హఠాత్తుగా చిక్కటి దిగులు తన భర్త కూడా అలాటి వాడే అయితే తను భరించగలదా? వంశీమోహన్ కూడా అలాటి వాడే అయ్యాంటాడా?....

చిక్కటిదిగులులా ఇంకా చిక్కటి కోరిక 'ఎల్లుండి తనకీ అతనికీ నిశ్చితార్థం అతని మనసులో మానవత్వం వుందో లేదో తెలుసుకుని పెళ్ళి చేసుకోవడం మంచిదో లేదో ఆలోచించి రేపే నాన్నతో చెప్పేయొచ్చు తనకీ పెళ్ళి ఇష్టంలేదని ఆయన కాదనరు.'

ఫోన్ దగ్గరకు నడిచాను. క్రేడిల్ మీద నుండి ఫోన్ ఎత్తాను చేతులు కొద్దిగా వణికాయి అతనెవరో తనకు తెలీదు. ఇలా తను చొరవ చేయడాన్ని అతనెలా తీసుకుంటాడో తన ఈ తొందర పాటు వల్ల అన్ని విధాలా యోగ్యుడైన అతన్ని పోగొట్టు కుంటుందేమో'

ఆ ఆలోచన క్షణం కూడా నిలవలేదు. ఎన్ని యోగ్యతలున్నా గుండెల్లో కరుణ

లేని వాడిని తను చేసుకోకూడదు.

"హలో"

"అవతలి వ్యక్తి రెండు రింగ్స్‌కే ఫోన్ అందుకున్నాడు...

"వంశీమోహన్ గారున్నారా?"

"నేనే మాట్లాడుతున్నాను"

నా గుండె వేగంగా కొట్టుకుంది. నా మనసులో ఏదరానికో షాక్ కొట్టిన అనుభూతి

"నేను.... నేను.... నేను జ్యోత్స్నని మాట్లాడుతున్నాను"

అవతలి వ్యక్తి క్షణం మాట్లాడలేదు. ఆ తర్వాత 'ఏమిటండీ జ్యోత్స్న గారు చెప్పండి' అన్నాడు ఆ గొంతులో వేగం, మార్దవం

"మీతో నేను కాస్త మాట్లాడాలి"

"వెల్‌కమ్ నేను రానా?"

తడబడ్డాను అతనితో తను మాట్లాడాలనుకోవడం నాన్న ఒప్పుకోరు. కానీ 'మీరు రావద్దు' అని చెప్పడం అసభ్యత అతను నామౌనాన్ని అర్థం చేసుకున్నట్టున్నాడు.

"హలో... పోనీ.. మీ ఇంటి ప్రక్కనున్న హోటల్ చైనా టౌన్ రెస్టారెంట్‌కు రానా? మీ ఇష్టం చాయిస్ ఈజ్ యువర్స్"

నాకు తోచలేదు. అతనితో మాట్లాడాలనే తపనే కానీ ఎక్కడ కలవాలి అనేది నేను నిర్ణయించుకోలేదు క్షణం తర్వాత సాహసించి అన్నాను. "అలాగే వుపొద్దున తొమ్మిది గంటలకు వస్తాను".

"ఓకే షార్ప్ నైన్"

"థాంక్స్" ఫోన్ పెట్టేసాను.

చైనా టౌన్ హోటల్‌లో ఖరీదైన బల్ల ముందు మెను కార్డు పట్టుకుని కూర్చొనున్న ఆయనను చూడగానే పాతికేళ్ళ పైబడ్డ నా కాళ్ళు తడ బడ్డాయి. వాకిట్లో నా నీడ పడగానే అతను తలెత్తాడు అంటే అలాఅతను తొమ్మిది దాటిన ఈ నాలుగు నిమిషాల్లో చాలా సార్లు తలెత్తుండాలి. తన కోసం అతను అంతలా ఎదురు చూస్తుండాలి.

నేను మెల్లగా వెళ్ళికూర్చున్నాను.

"బేరర్ అడుగుతుంటే భావుండదని టీ ఆర్డరిచ్చాను. మీకేమి ఆర్డరు ఇవ్వను?" అన్నాడు సభ్యత పాటిస్తూ

"నాకేమీ వద్దు... మిమ్మల్ని ఇప్పటికే ఇబ్బంది పెట్టాను"

"ఇబ్బందా? భలేవారే ఇట్స్ ఎ ప్లెజర్ ఫార్ మి"

అతను ఇబ్బంది పడ్డా ఇబ్బంది పడ్డానని చెప్పడు అది మన సాంఘిక మర్యాద.

నేను మాట్లాడలేదు మాట్లాడడానికి ధైర్యాన్ని కూడగట్టుకుంటున్నాను.

"మీరు మోహమాట పడ్తున్నారు. అందుకని మీకో నిజం చెప్తాను. మీతో పెళ్లి మాటలు జరిగినప్పటి నుండి మీతో మాట్లాడాలని కోరిక మిమ్మల్ని నేరుగా అడిగితే నన్ను రౌడీ అనుకుంటారని భయం". అని చిన్నగా నవ్వి "మీ ఫాదర్‌ని అడిగాను కానీ

ఆయన కొద్దిగా సంకోచించారు. ఆయన్నిక ఇబ్బంది పెట్టడంఇష్టం లేక మరలా అడగలేదు"

నేను కొద్దిగా గిల్టీగా ఫీల్ అయి తల వంచుకున్నాను.

"మీరడిగారని నేనేమీ అనుకోవడం లేదు. ఓ ఆడపిల్ల ఇలా అడిగిందంటె అది చాలా అవసరమైన విషయమయ్యుంటుంది.' చెప్పండి నేను మనసులోనే అతని సంస్కారాన్ని మెచ్చుకున్నాను. నాకు కావాల్సిన జవాబు అతని దగ్గర నుండి దొరుకుతుందనే ఆశించాను.

"అడగండి జ్యోత్స్న గారూ! మీరేమి అడగాలనుకుంటున్నారో నిస్సంకోచంగా అడగండి"

నేను టెన్షన్ ఫీల్అవుతూ ఎక్కువసేపు అక్కడ కూర్చొవడం బాగుండదని చెప్పాల్సిందంతా చెప్పి అన్నాను.

"నేను చేసింది చాలా అమానుషరోకదండీ"

అతను ఒక్క క్షణం కూడా వృధా చేయకుండా జవాబిచ్చాడు.

"మీరు తప్పేమీ చేయలేదు"

నేను దెబ్బతిన్నాను. నా ఆశలు దెబ్బతిన్నాయి.

"మీకీ జవాబు నచ్చలేదు అవునా?" చిన్నగా నవ్వాడతను.

〈 మీరుఆశించే జవాబేమిటో నాకు మీరు నిన్న జరిగిన విషాద సంఘటన గురించి చెప్పిన ఆ తీరులోనే అర్థమయింది. కానీ... కానీ జ్యోత్స్న గారూ! మీరాశించే జవాబు నే మీకు నేను ఇవ్వాలంటే అందులో నానిజాయితీ ఏముంటుంది? నేను నిజాయితీగా చెప్తాననే కదా ఇంత ధైర్యం చేసి మీరు నాదగ్గర కొచ్చారు. చేసుకోబోయే అమ్మాయిని నేను మోసం చేయకూడదు కదా!"

నాకుఅతని జవాబులో నిజాయితీ భావంనచ్చింది. కాబోయే భార్యనిమోసం చేయ కూడదనే భావం నచ్చింది. 'కానీ మీరు తప్పు చేయలేదు అనడంలో అతనైనా ఇలానే ప్రవర్తిస్తాడనే భావం మాత్రం నచ్చలెదు. కానీ నేను దాన్ని వ్యక్తం చేయలేదు.'

"జ్యోత్స్నగారూ! మీ ఇంటికి ఓ అనాథ ఆడపిల్ల వస్తుందనుకోండి ఆశ్రయం కోసం మీ భర్త ఊరికే అంటున్నాను. మీ భర్త ఆ అమ్మాయిని చూసి చలిస్తాడనుకోండి ఆ అమ్మాయి తప్పు ఏమీ లేకపోయినా మీరా అమ్మాయిని ఇంటి నుండి పంపించేస్తారా లేదా?"

"పంపించేస్తాను అది నాజీవిత సమస్య" తలవంచుకుని అన్నాను.

"ఇదీ అంతే ఇది మీ తాతయ్య గారికి జీవిత సమస్య కావచ్చు మనదేశంలో లా & ఆర్డర్ అలా వుంది" బేరర్ తెచ్చిన కాఫీ నావైపుకు నెట్టి మరో కాఫీ ఆర్డర్ చేసారు.

"కానీ... కానీ... ఆ అమ్మాయిని నేను పంపించేసానంటే మరెవరైనా ఆశ్రయమివ్వచ్చు. అతనిది ప్రాణం నిమిషాల మీద ఎవరైనా రక్షించకపోతే గాలిలో కలిసిపోతుందది"

"కరెక్ట్......"

"కానీ మీరు...." కాఫీ కప్పును వేళ్ళతో కదుపుతూ అన్నాను.

"మీ 'తప్పు చేయలేదు' అన్నాను. కానీ అతన్ని రక్షించడం మంచిది కాదు అనలేదు" బేరర్ తెచ్చిన కాఫీ కప్పు అందుకుంటూ అన్నారు. అతని పెదాల మీద చిత్రమైన చిరు నవ్వు కేసు వాదించేటప్పుడు లాయర్ పెదాల మీద కదలాడే చిరునవ్వు.

"అంటే?" చిన్నగా అడిగాను.

"అంటే జ్యోత్స్నగారూ! నేనైతే ఆగి అతన్ని హాస్పిటల్‌లో చేర్పించి ఏదొచ్చినా ఎదుర్కొనుందును. కానీ మీ తాతగారు పెద్ద వారు అంత మనోధైర్యం ఆయన కుంటుందా? అందుకని ఆయన తప్పు చేయలేదన్నాను".

నా ముఖం వికసించింది. నామనసు తేలిక పడింది.

"కానీ ఒకవేళ అతన్ని రక్షించి చిక్కుల్లో పడుంటే ఆకేస్ నామీద వేసుకునే దాన్ని! తాతయ్యకు ఎందుకు బయం?"

ఈ సారి అతను కాస్త పెద్దగా నవ్వాడు. "మరీ పసిపాపలా మాట్లాడుపతున్నారు. మీరే ఒక వేళ కారు డ్రైవ్ చేస్తున్నారనుకోండి మీరు ఏదైనా యాక్సిడెంట్ చేసారనుకోండి. నేను ఆకేస్ నామీద వేసుకుంటానుకానీ మీ మీద వేస్తానా? అది ప్రేమండీ"

అతను అలాఅనగానే నాకింతవరకు అనుభవాదానికి తీయటి భావం నన్ను ఆక్రమించుకుంది.

అతను క్షణంలో సీరియస్ అయిపోయాడు. "జ్యోత్స్నాగారూ? మనలా & ఆర్డర్ కాస్త మారనంతవరకూ లాయర్లలో నిజాయితీ రానంతవరకు, మనుషుల్లో కుళ్ళు తగ్గనంతవరకు ఇలాటి పరిస్థితుల్లో ప్రతి వాడూ పోటి మనిషిని రక్షించడానికి సంకోచిస్తూనే వుంటాడు తప్పదు"

"అంటే ఇలా అనామకపు చావులు కొనసాగాల్సిందేనా?"

నాకంఠంలో నిర్వేదనకు చలించాడేమో కాబోతున్నభార్య అని ధైర్యంచేసి చెయ్యిమీద అతని చెయ్యి కేవలం క్షణకాలం.

నాప్రాయం స్పందించింది.

"జ్యోత్స్నా! సారీ! సారీ!...."

"పర్వాలేదు చెప్పండి" నాలోని స్పందనను అణుచుకుంటూ అన్నాను

"ప్రతి వాడి గుండెలోనూ సాఫ్ట్ కార్నర్ వుంటుంది. ఏదో క్షణంలో ప్రతి మనిషికి ఎదుటి వాడికి సహాయం చేయాలి' అనే భావం కలుగుతుంది. కానీ మనం మనుషులం కదా! మనలో స్వార్థం వుంటుందికదా! ఎదుటి వాడికి సహాయం చేయగలంకానీ మనం కష్టాలు కొనితెచ్చుకోలేం కదా! మీ తాతయ్య ఎలాగో బయట పడ్డారు. కొందరయితే ఆ ఉచ్చుల్లో బిగుసుకుపోతున్నారు పూర్ ఫెలోస్"

"అలా.... అనీ...."

ఆగమన్నట్లు చెయెత్తి చిన్నగా నవ్వాడు వంశీమోహన్,

"ఒక కిడ్నీ అయితే ఇవ్వగలం కానీ, రెండూ ఇవ్వలేంకదా?"

ఇక్కడ నేను ఆగాల్సివచ్చింది. అయినా నసిగాను "నిజమే కానీ..."

"మీ మనసు మరీ సున్నితం లాగుంది. తనకుమాలినధర్మం మంచిదికాదు"

చాలా నిరాశపడ్డాను నేను

ఓ మూల ఆశాభంగం మరోమూల ఈనాలుగు నిముషాల పరిచయంలో అతన్ని వదులుకోలేని దుర్బలత.

"అయితే చెప్పండి అప్పుడు నేనేం చేసుండాలంటారు?'

నీరసంగా అడిగాను

"మీరేం చేసుండాలో నేను నిర్ధారించలేను ఇప్పిటికి, మీరుఇంకా నాకేమికారు"

"ఏమైనా అయితే..."

అతని ముఖం వెలిగింది.

"అంత అదృష్టం నాకుందంటారా?"

"ఎందుకని అలా అనుకుంటున్నారు?"

"మీరు నన్నిక్కడకు ఎందుకు రమ్మన్నారో, మీరీ ఇంటర్వ్యూ నాకెందుకు పెట్టారో నాకర్ధమైంది. దాంట్లో నేను ఓడిపోయాను. మీరుఆశించిన జవాబు నేనివ్వలేకపోయాను. ఇవ్వలేక పోతున్నాను కూడా"

"ఎందుకని?"

అతను వెంటనే జవాబు చెప్పలేదు గ్లాస్ తీసుకుని వాటర్ సిప్ చేసి నవ్వాడు ఆనవ్వు చాలా బావుంటుంది.

"మీ తాతగారు ఒకమారు మోసగించబడ్డావారు ఆయనలోని సహాయంచెయ్యాలనే మనస్సు చంపబడింది. మీరు ఇంకా ఎదగని ఈ సమాజంలో పుట్టిన ఆడవాళ్లు ఒకవేళ మీరు అతన్ని రక్షించి మీ తాతగారిలా చిక్కుల్లో పడుంటే ఒక ఆడపిల్ల మీద కదలు అల్లడమనేది ఈ సమాజానికి సరదా నేనయితే కోర్టు చూట్టూ తిరుగగలను. తెలివిగా తప్పించుకోగలననే ధైర్యం నామీద నాకుంది"

"నాకోసం ఈ జవాబు చెప్తున్నారా?"

అతను వెనక్కువాలి నిట్టూర్చాడు.

"ఎకరికోసమూ నానిజాయితీని చంపుకోలేను. అదే నాదుర్భలత్వం అందుకే కొందరికి దూరమయిబాధపడిన రోజులూ వున్నాయి. అయినా ఈ బలహీనత నానుండి పోవడం లేదు.

"అది బలహీనత ఎలా అవుతుంది?"

ఈసారి అతని కళ్ళల్లో మెరుపురేఖ

నిజానికి అతని జవాబుతో నేను సంతృప్తి పడాలి.

వంశీ మోహన్ నా ఇంటర్వ్యూలో నెగ్గాడు కానీ నాలో ఇంకా, ఎదో అలజడి

"అంటే ఇలాటి వాటికి పరిష్కారం లేదన్నమాట" నిట్టూర్చాను.

నామనసులోని భావాలను అర్థం చేసుకున్నట్లు అతనిలా అన్నాడు

"మీరొక పని చేసుండాల్సింది మీరక్కడే ఆగి వెనుక వచ్చిన కార్లని ఆపి వాళ్ళు సాక్ష్యం చెప్పేలా వాళ్ళని కన్విన్స్‌చేసుకుని అప్పుడతనికి సహాయం చేసుండాల్సింది."

"అయ్యో! నాకంత ఆలోచనే రాలేదు... పాపం అతను చనిపోయుంటాడు.... నేనలా చేసుండాల్సింది. వంశీ మోహన్ నావైపు బాషకందని భావంతో

"జ్యోత్స్నా! పూర్కేనేనలా అన్నాను కానీ మీ వెనక వచ్చిన వాళ్ళు తమ అవసరాలు మానుకుని మీతో హాస్పిటల్‌కి, ఆ తర్వాత కోర్టుకి వస్తారని నేననుకోను. కానీ రోజులు మార్తాయి. మనం మెచ్చే రోజులు వస్తాయి. ఆరోజులు రావాలంటే లా అండ్ ఆర్డర్ పుస్తకంలో కొన్ని పేజీలు తిరగవ్రాయాలి. అలా తిరగ వ్రాయబడ్డ 'లా' ని కొందరు అవకాశవాదులు తమ స్వప్రయోజనానికి వాడుకోకూడదు అప్పుడు మానవత్వం వికసిస్తుంది. దయనీయపు చావులు అంతమవుతాయి.

చాలా సీరియస్‌గా అన్నాడు.

నేనాలోచిస్తున్నాను. 'ఆరోజు నిజంగా వస్తుందా?'

"ఇంటర్వ్యూ పూర్తయిందా జ్యోత్స్నగారూ!"

నేను తలెత్తాను అతని పెదాలు నవ్వుతున్నాయి

నేనూ నవ్వేసానుకానీ నా కనురెప్పలు బిడియంతో భారంగా వాలిపోయాయి. అతను లేచినిల్చున్నాడు.

"ఒకే బై" అతని ముఖంలో అఫెండయిన సూచనలు లేవు అతని పెదాల మీద చిరునవ్వు ఆలాగే వుంది.

నేను తల వంచుకున్నాను. నేనింతవరకు అణిచి పెట్టుకున్న సంకోచం సిగ్గు నన్ను మరలా అక్రమించుకున్నాయి.

అతను కూర్చున్నాడు.

'ఇంతకీ నేను ఇంటర్వ్యూలో నెగ్గానా? ఆమాటలు వ్యంగ్యంగాలేవు అందులో ఎత్తిపొడుపు లేదు. అందులో హాస్యం వుంది నామనసు తెలిసిపోయిన భావం వుంది'.

"అయితే రేపు మన నిశ్చితార్థం వుందన్నమాట" నన్నుడికిస్తూ అన్నాడు.

"రేపు కాదు ఈ రోజే మన నిశ్చితార్థం జరిగిపోయింది" అన్నాను.

ఈసారి అతని చెయ్యి నాచేతిమీద నిర్భయంగా పడింది.